భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 26.0
తేమ : 33.0 - 27.0



విత్తకుండానే మొలకలు !

» సబ్సిడీపై వరి విత్తనాలు సరఫరా..

» ముక్కపాయిపై రైతుల అసంతృప్తి



నరసాపురం రూరల్, ఆగస్టు 19 : ప్రభుత్వం రైతుల కందించిన సబ్సిడీ విత్తనాలు విత్తకుండానే మొలకలు రావడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కష్టాల్లో ఉన్న తమకు ఇలాంటి విత్తనాలా.. సరఫరా చేసేది ? అంటూ మండిపడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసింది. నరసాపురం మండలంలో 1200 మంది రైతులకు 86 మెట్రిక్ టన్నులు విత్తనాలు పంపిణీ చేసింది. వీటిలో ఎంటీయూ 1153 రకం బస్తాలో కేజీలు, ముక్కపాయి ఉన్నట్టు వైఎస్ పాలెంకు చెందిన రైతులు వైఎస్ వేణు, కూనపరెడ్డి కృష్ణ సోమవారం గుర్తించారు. ఈ విత్తనాలతో సాగు చేసే పంటను పూర్తిగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. పంటకు, పంటకు 20 రోజులు తేడా వస్తుందని, పెట్టుబడి వ్యయం పెరిగిపోతుందని వాపోయారు. వీటిని మార్చాలని కోరుతున్నారు. దీనిపై ఏవో జాన్సన్‌ను వివరణ ఇస్తూ రైతులు బస్తాలు తెరవకుండా ఉంటే తిరిగి తమకు అందజేయాలని కోరారు. ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.

పనులు చేయండి

కాంట్రాక్టర్లను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యేలు

» భీమవరం, తాడేపల్లిగూడెం పట్టణాల్లో అమృత్ 2.0 పనుల పురోగతిపై ప్రణాళికలు

» గత ప్రభుత్వ హయాంలో కమీషన్ల కక్కుర్తి

» కాంట్రాక్టర్ల బెంబేలు.. నిలిచిన పనులు

» గాడిన పెట్టేందుకు ప్రభుత్వం యత్నాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కేంద్రం అమలు చేస్తున్న అమృత్ పథకం 2.0లో ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం హడావుడి చేసింది. జిల్లావ్యాప్తంగా దాదాపు రూ.155 కోట్ల నిధులకు అనుమతులు మంజూరు చేసింది. అందులో భాగంగా తాడేపల్లిగూడెంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు టెండర్లు ఖరారుచేసి ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర నిధుల నుంచే 5.50 కోట్లతో పంపుల చెరువు వద్ద కొత్త ఫిల్టర్‌ను ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కాంట్రాక్టర్ ఫిల్టర్ పనులు ప్రారంభించారు. భవన నిర్మాణం పూర్తయ్యింది. ఎన్నికల సమయంలో నియోజకవర్గ నేత కాంట్రాక్టర్లకు కబురు పెట్టి 20 శాతం కమీషన్ ఇవ్వాలంటూ హుకుం జారీచేశారు. కాంట్రాక్టర్ పరుగులు తీసి ఇప్పటి వరకు మున్సిపాలిటీ ముఖం చూపలేదు. పనులు చేపట్టడం లేదు.

భీమవరంలో తెలుగుదేశం ప్రభుత్వం గతంలో అధికారంలో ఉన్నప్పుడే అమృత్ తొలి దశలో రూ.32 కోట్లు మంజూరు కాగా, 90 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన 10 శాతం పనులు నిర్వహించేందుకు వైసీపీ హయాంలో నానా తంటాలు పడ్డారు. అమృత్ 2.0లో రూ.47.29 కోట్లు నిధులు మంజూరుచేశారు. వైసీపీ హయాంలో పరిపాలన అనుమతులు ఇవ్వడానికి ఎదురుతెన్నులు చూడాల్సి వచ్చింది.

ఇటీవల రాష్ట్రంలో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ పనులను గాడిన పెట్టేందుకు ప్రజా ప్రతినిధులు నడుంబిగించారు. తాడేపల్లిగూడెంలో ముఖం చాటేసిన కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సంప్రదింపులు జరిపారు. పనులు చేయాలని సూచించారు. ఈ మేరకు బిల్లుల విడుదలకు కసరత్తు చేస్తున్నారు. కొత్త ఫిల్టర్ పూర్తయితే పట్టణ ప్రజలకు సమృద్ధిగా మంచినీరు అందుతుంది. ప్రస్తుతం తాడేపల్లిగూడెంలో 1.4 కోట్ల లీటర్ల నీటిని రోజూ సరఫరా చేస్తున్నారు. కొత్త ఫిల్టర్ పూర్తయితే మరో 1.10 కోట్ల లీటర్లు అందుబాటులోకి రానుంది. మొత్తంపైన 2.50 కోట్ల లీటర్లకు సామర్థ్యం పెరుగుతుంది. ఇందులో 10 లక్షల లీటర్లు ఏపీ నిట్‌కు, మిగిలింది ఏపీ టిడ్కో ఇళ్లతోపాటు, పట్టణ ప్రజలకు అందిస్తారు. ఎఫ్‌సీఐ కాలనీ, హౌసింగ్ బోర్డు ప్రాంతాలకు 24 గంటలూ అందుబాటులో ఉంచుతారు. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. చెరువు తవ్వకం పనులు చేపట్టలేదు. రూ.31.64 కోట్లతో చెరువు తవ్వకం పనులు చేపట్టాలి. ఎన్నికల ముందే పనులకు శంకుస్థాపన చేసినా, కాంట్రాక్టర్ పనులు నిర్వహించలేదు. మరోవైపు రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి పంపుల చెరువు వరకు పైప్‌లైన్, ట్యాంకు నిర్మాణానికి మరో రూ.41.19 కోట్లు మంజూరయ్యాయి. వీటిని వినియోగంలోకి తేలేకపోయారు. దీనిని ఒక కొలిక్కి తెస్తున్నారు.



తాడేపల్లిగూడెంలో నిలిచిన కొత్త ఫిల్టర్ పనులు

భీమవరంలో డీపీఆర్ సిద్ధం

భీమవరంలో అమృత్ 2.0లో మంజూరైన రూ.47.29 కోట్ల పనులకు సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక సిద్ధమవుతోంది. ఎమ్మెల్యే అంజిబాబు ప్రజారోగ్య శాఖతో సమీక్ష చేపట్టారు. పనులపై ప్రణాళిక రచించారు. మూడు కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్‌లను నిర్మించనున్నారు. వంశీకృష్ణ నగర్, మారుతీ నగర్‌లో కొత్త ట్యాంక్‌లను నిర్మిస్తారు. బుధవారం మార్కెట్‌లో పెండింగ్‌లో ఉన్న ట్యాంక్‌ను పూర్తి చేస్తారు. కొత్తగా పంపుల చెరువు వద్ద మరో ఫిల్టర్‌ను నిర్మిస్తారు. ప్రస్తుతం భీమవరంలో 2.60 కోట్ల లీటర్ల నీటిని పంపిణీ చేస్తున్నారు. దీని సామర్థ్యాన్ని పెంచే దిశగా ఫిల్టర్‌ను కొత్తగా నిర్మిస్తారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పైప్‌లైన్ పనుల పూర్తికి అమృత్ 2.0 నిధులను వినియోగించనున్నారు. రెండు వారాల్లో నివేదిక సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపనున్నారు. అనుమతులు రాగానే, పనుల ప్రక్రియను చేపట్టనున్నారు.

సర్‌ప్లస్ సర్దుబాట్లు కొందరికే

» ఏలూరు జిల్లాలో మిగులు టీచర్లు 836 - వర్క్ అడ్జస్ట్‌మెంట్ వెకెన్సీలు 499

ఏలూరు అర్బన్, ఆగస్టు 19: సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో ఎంఈవోల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరగాల్సి ఉండగా, ఎలాంటి అభ్యంతరాలు తలెత్తని 13 మండలాల్లో తొలుత స్కూల్ అసిస్టెంట్ కేడర్ సబ్జెక్టు టీచర్ల కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. మండలానికి సగటున ఐదుకు మించి వెకెన్సీలకు కౌన్సెలింగ్ జరగలేదు. తాము లేవనెత్తిన అభ్యంతరాలపై పరిష్కారం చూపకుండా పని సర్దుబాటు చేస్తామంటే అంగీకరించబోమని పలుచోట్ల టీచర్లు చెప్పడంతో మిగతా మండలాల్లో స్థానికంగా సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలు వచ్చినచోట వాటిని సరిచేసేందుకు వీలుగా మంగళవారానికి వాయిదావేశారు. ముందుగా స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు టీచర్ల కొరతను మండలంలో, డివిజన్ పరిధిలో సర్దుబాటు చేసిన తర్వాతే సర్‌ప్లస్ ఎస్జీటీల అడ్జస్ట్ ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించారు. ఆ ప్రకారం ఏలూరు జిల్లాలో పలు సవరణల అనంతరం సర్‌ప్లస్ టీచర్ల సంఖ్య మొత్తం 836గా నిర్ధారించగా, వీరిలో ఎస్జీటీలు 616 మంది, స్కూల్ అసిస్టెంట్లు 220 మందిగా తేల్చారు. ఇక వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు వెకెన్సీల విషయానికి స్కూల్ అసిస్టెంట్లు 304, ఎస్జీటీలు 195 కలిపి మొత్తం 499 మాత్రమే ఉన్నాయి. దీనికనుగుణంగా తొలుత 304 స్కూల్ అసిస్టెంట్ కేడర్ సబ్జెక్టు టీచర్ల వెకెన్సీలకు మాత్రమే కౌన్సెలింగ్ చేపట్టాలని నిర్ణయించడంతో మండల పరిధిలో పని సర్దుబాటుపై భర్తీ చేసిన తర్వాత, ఇంకా సర్‌ప్లస్ టీచర్లు (స్కూల్ అసిస్టెం ట్లు) ఉంటే వారిని డివిజన్ పరిధిలోకి చేర్చి సంబంధిత డీవైఈవో ఆధ్వర్యంలో కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు. అప్పటికీ సబ్జెక్టు టీచర్ల కొరత సమస్య పరిష్కారం కాకపోతే సర్‌ప్లస్ ఎస్జీటీల సీనియార్టీ జాబితాలను ఓపెన్ చేసి నిబంధనలకు లోబడి స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఆయా సబ్జెక్టు టీచర్లుగా కౌన్సెలింగ్‌పై తాత్కాలికంగా నియమిస్తారు. ఇది పూర్తయిన తర్వాతే సర్‌ప్లస్ ఎస్జీటీలను అదేకేడర్‌లో కొరతవున్న ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠశాలలకు సర్దుబాటు ప్రక్రియ చేపడతారు.

కట్..కట్టా

మండుతున్న కాలం.. పెరిగిన విద్యుత్ వినియోగం



» అప్రకటిత కోతలతో జనం విలవిల

» వర్షాభావ పరిస్థితులతో పంటలపై ప్రభావం

ఏలూరు సిటీ, ఆగస్టు 19: ఉమ్మడి పశ్చిమ గోదావరిలో విభిన్న వాతావరణం నెలకొంది. వేసవిని తలపించేలా ఎండల తీవ్రత కొనసాగుతోంది. దీనికితోడు ఉక్కపోత పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. శ్రావణ మాసంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురిసి, రోజుల తరబడి ముసురు కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు. ఆగస్టులో కనిపించే వర్షాల జోరు లేదు. ఇది వర్షా కాలామా..? వేసవి కాలమా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతాలు నమోదవుతాయని వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. రెండున్నర నెలల కాలాన్ని చూస్తే వాతావరణంలో అనేక మార్పులు వచ్చాయి. వర్షాలకు భూమి, ఆకాశం, సముద్రాలు సహకరించాలి. అంటే మూడింటి మధ్య ఏర్పడే తేడాల కారణంగా వర్షాలు కురవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ మూడూ వేడెక్కడంతో సమతుల్యత దెబ్బతింది. ఫలితంగా వర్షాలు అంతంతగానే కురుస్తున్నాయి.

పంటలపై ప్రభావం

ఆగస్టులో వర్షాభావ ప్రభావం ఖరీఫ్ సాగుపై పడింది. ఈ సీజన్‌లో నీటి లభ్యతపై అనుమానాలు ఉన్నాయి. ఇప్పటికీ కొన్ని మండలాల్లో అతి స్వల్ప వర్షపాతం నమోదైంది. ఆయా ప్రాంతాల్లో సాగు నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ఆగమనం ముందుగానే ప్రారంభం కావడంతో ఖరీఫ్ ముందుగానే మొదలైంది. మధ్యలో అల్పపీడనాలతో భారీగా కురిసిన వర్షాలతో వరదల కారణంగా వరి నారుమళ్ళు, నాట్లు వేసిన పంట పొలాలు దెబ్బ తిన్నాయి. ఇప్పుడు నీటి లభ్యత ఎక్కువగా ఉండాల్సిన సమయంలో వర్షాల జాడ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది.

పెరిగిన విద్యుత్ వినియోగం

విభిన్న వాతావరణ పరిస్థితుల్లో రోజు వారీ విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఈ కారణంగా అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల కారణంగా తరచూ ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక ఇబ్బందులు ఏర్పడడం, విద్యుత్ కోటాకు వినియోగానికి మధ్య తీవ్ర వ్యత్యాసం ఉండడంతో కోతలు విధిస్తున్నారు. సాంకేతిక సమస్యల కారణంగా అంతరాయాలు ఏర్పడుతున్నాయని, కోతలు విధించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గతేడాదితో పోలిస్తే విద్యుత్ కోటా కన్నా వినియోగం పెరిగింది.

గత ఏడాదితో పోలిస్తే గత ఎనిమిది రోజుల్లో విద్యుత్ వినియోగం మిలియన్ యూనిట్లలో..

2024	మిలియన్ యూనిట్లలో..		2023	
కోటా	వినియోగం	ఆగస్టు	కోటా	వినియోగం
18.977	17.141	11	20.941	21.272
18.534	17.411	12	21.550	21.299
18.631	18.591	13	21.600	21.256
18.053	19.350	14	21.497	21.124
19.339	18.900	15	21.262	21.314
18.837	19.640	16	21.406	21.724
18.945	19.169	17	20.824	19.733
18.406	20.066	18	21.367	17.871
149.722	150.268	మొత్తం	170.447	165.594

రూ.50 కోట్లతో కాల్వల్లో పూడిక తీత

» ప్రధాన కాల్వలో 357, సబ్ ఛానల్స్‌లో రెండు వేల కిలోమీటర్లు

» ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఇరిగేషన్ అధికారులు

నరసాపురం, ఆగస్టు 19 : ఐదేళ్లుగా పంట కాల్వలకు మరమ్మతులు లేక పూడుకుపోయాయి. లాకులకు కనీసం గ్రీజు కూడా పెట్టని పరిస్థితి. మూడు నుంచి ఐదడుగుల మేర ప్రవహించాల్సిన ప్రధాన కాల్వలు ఒకటిన్నర అడుగుకే పరిమితమయ్యాయి. సబ్ ఛానల్స్ చెప్పనక్కర్లేదు. ఈ కారణంగా ప్రవాహం ముందుకు సాగక.. శివారు ప్రాంతాలకు సాగు నీరందడం లేదు. దీని పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. కాల్వల్లో పూడిక తీసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించింది. దీనికనుగుణంగా నీటిపారుదల శాఖ అధికారులు రూ.50 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో 357 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వలు, రెండు వేల కిలోమీటర్లు సబ్ ఛానల్స్‌లో పూడిక తీత పనులు ఉన్నాయి. నరసాపురం పంట కాల్వలో కొన్నిచోట్ల మూడడుగులు కూడా నీరుండటం లేదు. అడుగున్నర మేర సిల్ట్ పేరుకుపోయింది. ఎర్ర నీరు వచ్చినప్పుడు కొట్టుకొచ్చిన ఇసుక ఎక్కడికక్కడే మేటలు వేసింది. వీటిని తొలగించకపోతే నీరు వేగంగా ముందుకు సాగదు. ప్రస్తుతం ప్రధాన కాల్వతోపాటు అన్ని సబ్ ఛానల్స్‌లో కనీసం అడుగున్నర మేరైనా పూడికతీత పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే పనులు ప్రారంభిస్తారు.



కన్నులపండువగా.. పవిత్రారోపణ

ద్వారకాతిరుమల, ఆగస్టు 19: చిన తిరుమలేశుని ఆలయంలో జరుగుతున్న శ్రీవారి దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం పవిత్రారోపణ వేడుక కనుల పండువగా జరిగింది. ఉదయం యాగశాలలో అగ్ని ఆరాధన, చతుర్ధ కలశ స్నపనను అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ జరిపారు. స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులను వెండి తొళక్క వాహనంపై ఉంచి అలంకరించారు. పవిత్రాలను ఋత్వికులు తమ శిరస్సులపై ఉంచుకుని ఆలయ ఆవరణలో ప్రదక్షిణలు చేసి ఆపై శ్రీవారి మూల విరాట్‌కు, అమ్మవార్లకు ఉత్సవమూర్తులకు ధరింపజేశారు. ఆపై హోమాలు జరిపారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

» జిల్లా కలెక్టర్ నాగరాణి



భీమవరం రూరల్, ఆగస్టు 19 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు అందిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను నాణ్యతతోపాటు నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ (మీ కోసం) నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అర్జీల పరిష్కారానికి ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పక పాటించాలన్నారు. ప్రతీ అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, ఇళ్ళ మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూవివాదాలు తదితర అంశాలకు సంబంధించిన 112 అర్జీలను అర్జీదారులు కలెక్టర్‌కు అందజేశారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, డీఎల్‌డీవో ఏవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్

జిల్లాకు సంబంధించి 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రణాళిక (విజన్ డాక్యుమెంట్) సిద్ధం చేయాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వికసిత్ భారత్ 2047కి అనుగుణంగా 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ కింద రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తోందన్నారు. ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ ఏటా 15% వృద్ధిని సాధించే లక్ష్యంతో రాష్ట్రానికి సంబంధించిన ముసాయిదా విజన్ డాక్యుమెంట్ ఖరారు దశలో ఉందన్నారు. వృద్ధి రేటు లక్ష్యాలు సాధించడానికి జిల్లా/మండల స్థాయిలో ఆర్థిక, సామాజిక ప్రణాళికలు అవసరమన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం : ఏఎస్పీ

భీమవరం క్రైం, ఆగస్టు 19 : అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు అధికారులను ఆదేశించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను ఏఎస్పీ స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేస్తామని చెప్పారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై ఎనిమిది ఫిర్యాదులు అందాయి.




ఎస్పీకి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

జిల్లావ్యాప్తంగా సోమవారం రాఖీ పౌర్ణమి పర్వదినం ఘనంగా జరిగింది. సోదరులకు అక్క చెల్లెళ్లు రాఖీలు కట్టి సోదర ప్రేమను చాటారు. భీమవరంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మికి బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. వారికి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యాన వనానికి ఊతం

పామాయిల్‌పై ప్రత్యేక డ్రైవ్.. మెగా ప్లాంటేషన్ కోసం ప్రోత్సాహకాలు -7లో..



కొండవాగులు పొంగాయి..

ఏజెన్సీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి అటవీ ప్రాంతంలోని కొండవాగులు ఉధృతంగా ప్రవహించాయి. భారీవర్షం కారణంగా మన్యం దేవత గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వద్ద ఉన్న ఎర్రఎక్కుడు కొండవాగు సుడులు తిరుగుతూ ఉధృతంగా ప్రవహించింది. వాగులు తెల్లవారుజామున పొంగడంతో ఆలయానికి వెళ్ళే భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. గురువారం, ఆదివారం తప్ప మిగతా రోజుల్లో భక్తులు అంతగా అమ్మవారి దర్శనానికి వెళ్లరు. దీంతో ఎటువంటి ఇబ్బందులు కలగలేదని కమిటీ సభ్యులు తెలియజేశారు. - బుట్టాయగూడెం

చిన వెంకన్న క్షేత్రంలో పెళ్లి భాజాలు



శ్రావణమాసం...మంచి ముహూర్తం కావడంతో ఆదివారం రాత్రి శ్రీవారి క్షేత్రంలో పెళ్లిళ్ల భారీగా జరిగాయి. చినవెంకన్న సాక్షిగా దాదాపు 150 వరకూ జంటలు ఒక్కటయ్యాయి. ఆలయ అనివేటి మండపంతో పాటు దేవస్థానం కల్యాణ మండపాలు, ప్రైవేటు కల్యాణమండపాలు, సత్రాలు, రూములు పెళ్లిళ్లకు వచ్చినవారిలో ఫుల్ అయ్యాయి. ఎక్కడా ఖాళీ లేకపోవడంతో ఆలయ మెట్లదారిలో కూడా పెళ్లిళ్ల జరిగాయి. గుడి సెంటర్‌లో పెళ్లివారి వాహనాలు ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వివాహాల అనంతరం సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

-ద్వారకాతిరుమల

పున్నమి నాగులు

శ్రావణ పౌర్ణమి రెండు సర్పాలు సయ్యాటలాడాయి. స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో తన పామాయిల్ తోటలో నీరు పెట్టేందుకు సోమవారం యజమాని వెళ్లగా ఈ దృశ్యం కనిపించింది. ముందుగా కొంత భయపడినా కాస్త తేరుకుని పక్క రైతులను పిలిచాడు. దాదాపు గంటసేపు ఇలా పాములు జతకట్టాయి. కొందరు ఆ దృశ్యాలను తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించారు. ఈ విషయం అన్నిచోట్లకు పాకి పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో చూసేందుకు తరలి వచ్చారు.

-ద్వారకాతిరుమల





సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సుబ్బారావు

నేటి నుంచి ఇంటింటా ఓటర్ సర్వే

ఏలూరు రూరల్, ఆగస్టు 19: ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ తయారీలో భాగంగా మంగళవారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. అక్టోబరు 18 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. అక్టోబరు 19 నుంచి 28 వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. అనంతరం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి, డిసెంబరు 24లోగా అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. డిసెంబర్ 24లోగా అభ్యంతరాలపై వచ్చిన పరిష్కార కార్యక్రమం చేపట్టాలన్నారు. 2025 జనవరి 1లోగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జాబితా రూపొందించి సిద్ధం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ జి.శేషగిరిరావు, ఎంపీడీవో ప్రణవి, తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ గాయత్రి పాల్గొన్నారు.



ఒకే పేరుతో వేర్వేరుగా ఇచ్చిన ల్యాబ్ రిపోర్టులు.. విలేకరులకు వివరిస్తున్న బాలుడి తండ్రి

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యం

బాలుడికి రెండు రకాల రక్తపరీక్ష రిపోర్టులు

అయోమయంలో తండ్రి

ఏలూరు క్రైం, ఆగస్టు 19 : ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోజూ ఏదో విభాగంలో వైద్యులు, సిబ్బందిపై ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. ల్యాబ్ విభాగంలో ఒక బాలుడికి రక్త పరీక్షకు వస్తే రెండు వేర్వేరు రిపోర్టులు ఇచ్చారు. అక్కడ ఉన్న ఇన్‌ఛార్జి పట్టించుకోక పోవడంతోనే ఇష్టారాజ్యంగా ల్యాబ్ టెస్టులు చేయకుండా ఏదో నెంబర్ వేసి ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. హనుమాన్‌నగర్‌కె చెందిన షాలీమ్‌రత్నం (12) అనే బాలుడికి పది రోజుల నుంచి జ్వరం రావడంతో ఆ బాలుడి తండ్రి ఈనెల 17వ తేదీన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చాడు. అక్కడ వైద్యులు రక్తపరీక్షలు రాశారు. ల్యాబ్‌కు వెళ్లి రక్త నమూనాలు ఇచ్చారు. రిపోర్టులకు సోమవారం రమ్మని చెప్పడంతో 19వ తేదీ ఉదయం వెళ్లి రిపోర్టు తీసుకున్నారు. ఆ రిపోర్టుపై అనుమానం వచ్చి మళ్లీ వెళ్లి రిపోర్టు అడిగాడు. మళ్లీ వేరే రిపోర్టు రాసి ఇచ్చారు. రెండు రిపోర్టులు ఆ బాలుడి పేరుతోనే ఇచ్చారు. రెండింటికి వేర్వేరుగా ఉండడంతో ఆ తండ్రి అవాక్కయ్యాడు. వెళ్ళి ప్రశ్నిస్తే ల్యాబ్‌లో ఉన్న వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఆదే విషయాన్ని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేయగా సెక్యూరిటీ గార్డును పిలిచి అతనితో ల్యాబ్‌కు పంపి ఆ రిపోర్టులు సరిచేసి ఇమ్మన్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు చెబుతున్నాడు. ల్యాబ్‌లలో ట్రైనింగ్ విద్యార్థులతోనే పనులు టెస్టులు చేయిస్తున్నారని, ఇన్‌ఛార్జి పట్టించుకోరనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

నీళ్ల ట్యాంక్ ఎక్కి..హల్‌చల్

నాలుగు గంటలపాటు హడావుడి..

భీమవరం క్రైం, ఆగస్టు 19: భీమవరం పట్టణంలోని జంక్షన్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న నీళ్ళ ట్యాంక్‌పైకి ఒక వ్యక్తి ఎక్కి సోమవారం హల్‌చల్ చేశాడు. తనకు న్యాయం చెయ్యాలని తన భార్య ఇంటికి రానివ్వడం లేదని.. పిల్లలు పట్టించుకోవట్లేదంటూ నీళ్ళ ట్యాంక్‌పై ఉన్న ఇనుప ఊచకు కండువాతో చేతులు కట్టుకుని అందరినీ కంగారు పెట్టాడు. గునుపూడికి చెందిన నాగరాజుగా (43) అక్కడివారు గుర్తించారు. పోలీసులు అక్కడకు చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడతో కిందకు దిగాడు. మద్యం మత్తులో ట్యాంక్‌పైకి ఎక్కినట్లుగా స్థానికులు చెబుతున్నారు.



పోలీసుల అదుపులో మందుబాబు



వేద విద్యార్థులకు ఉత్తీర్ణతా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ..వేద సమ్మేళనంలో పాల్గొన్న పండితులు,విద్యార్థులు

వేద ఘోషతో పులకించిన సరిపల్లె

వైభవంగా 104వ వేద పరిషత్ సమ్మేళనం

వేద పాఠశాల పూర్వ వైభవానికి కృషి చేస్తాం : ఎమ్మెల్యే

గణపవరం, ఆగస్టు 19: వేదమంత్రాల ఘోషతో గణపవరం మండలం లోని సరిపల్లె గ్రామం మారుమోగింది. స్థానిక గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 104వ వేద శాస్త్ర పరిషత్ మహాసభ నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న సభలకు దేశంలోని బిహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 105 మంది వేద విద్యార్థులు హాజరయ్యారు.సోమవారం జరిగిన ఈ వేదసభల్లో 105 మంది పరీక్షల్లో పాల్గొనగా 63 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎమ్మెల్యే ధర్మరాజు చేతుల మీదుగా వారికి ఉత్తీర్ణత పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేదాలు ఎక్కడా ఘోషిస్తాయో అక్కడ సిరిసంపదలు, సుఖశాంతులు వర్ధిల్లుతాయన్నారు. సరిపల్లెలోని సంఖ్యాద్రి వర్ధక నిలయంలో వేదాలు నేర్చుకుని తిరుపతి, శ్రీశైలం, సింహాచలం, అన్న వరం వంటి ప్రధాన క్షేత్రాల్లో ఆగమ పండితులుగా కొన సాగుతున్నారని అటువంటి వేదనిలయాన్ని పునఃప్రారంభించేందుకు అవసరమైన సహాయ సహకరాలు అందిస్తానని ధర్మరాజు అన్నారు. గణపవరానికి చెందిన కూసం పూడి సుబ్బరాజు, వెంకట సుబ్బమ్మ, దెందుకూరి సుశీల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో ఏటా ఈ వేద సభలు నిర్వహిస్తు న్నారు. పొత్తూరి వాసురాజు, సాగిరాజు సుబ్బ రాజు, సాగిరాజు సాయిరాజు, గాయత్రీ బ్రహ్మణసేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమాజహితానికి వేదాల్ని ఉపయోగించాలి



సరిపల్లెకు గత 40 ఏళ్లుగా వస్తున్నాను. 1976లో ఇక్కడి నుంచి వేద విద్యలో పట్టా పొందాను. 1985 నుంచి పరీక్షాధికారిగా వస్తున్నాను. సమాజా భివృద్ధికి వేదాల్ని ఉపయోగించాలి. 104 ఏళ్లుగా దేశంలో వేదపండితులు ఇక్కడ నుంచి వెళ్ళినవారే. కాశి, తిరుమల తిరుపతి, శ్రీశైలం, అన్నవరం, తదితర క్షేత్రాల్లో పనిచేస్తున్నారు.

- గుల్లపల్లి విశ్వనాథ గణాపాఠి, టీటీడీ వేద పాఠశాల అధ్యాపకులు

మొదటిసారిగా పరీక్షాధికారిగా వచ్చాను



సరిపల్లెలో మొదటి సారిగా శుక్ల యజుర్వేద పరీక్షలు ప్రారంభించడంతో పరీక్షాధికారిగా పిలిచారు. తిరుపతి వెంకటేశ్వర వైదిక విశ్వ విద్యాలయం ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. యజ్ఞం చేసే విధానం, దాని ఫలితాలు, శుక్ల యజుర్వేదం తెలుపుతోంది. యజ్ఞం ద్వారా వచ్చే వాయువులు, మంత్ర ఉచ్ఛరణ ద్వారా వచ్చే ధ్వని తరంగాలతో ఆ ప్రాంతంలో ప్రకృతి పరవ శమవుతుంది.

-డాక్టర్ గోవింద్ ప్రసాద్, తిరుపతి, పరీక్షాధికారి

వేద పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించా



సామ వేదపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాను. ఇక్కడ వేద పాఠశాలకు ప్రాచీన చరిత్ర ఉందని మా కుటుంబ సభ్యులు తెలిపారు. ఇక్కడ వేద పరీక్షల్లో పట్టా పొందితే నా మనుగడకు ఎంతగానో ఉపయోగపడుతుంది.ఈ పరీక్షల్లో తొలిసారిగా పాల్గొన్నాను. సామవేదం సంగీత లయబద్ధమైనది. ప్రాచీన సంగీతం ఈ వేదం నుంచే పుట్టింది.

-రోహిత్ శర్మ, మహారాష్ట్ర, వేద విద్యార్థి

తొలిసారిగా ఇక్కడ పరీక్షల్లో పాల్గొన్నా



విజయనగరం నుంచి తొలిసారిగా ఇక్కడ పరీక్షల్లో పాల్గొన్నాను. సామ వేదంలో ఉత్తీర్ణత సాధించాను. పట్టా తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. సంప్రదాయానికి, ధర్మానికి ప్రతీకలైన వేదాలను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

-సాయిచరణ్, విజయనగరం, వేదవిద్యార్థి



తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటలో పామాయిల్ సాగుకు మొక్కలు నాటిన ఉద్యానశాఖ అధికారులు

ఉద్యాన వనానికి ఊతం



పామాయిల్‌పై ప్రత్యేక డ్రైవ్

మెగా ప్లాంటేషన్ కోసం ప్రోత్సాహకాలు

వైసీపీ హయాంలో చెల్లించని ప్రభుత్వం

తాజాగా బకాయిలు విడుదల

కొత్త సాగుకు రైతులు ఉరుకులు

ఈ ఏడాది లక్ష్యం 300 హెక్టార్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పామాయిల్ వంటనూనెను భారీ స్థాయిలో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వేల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో పామాయిల్ ధరలు కూడా పెరిగిపోయాయి. భవిష్యత్తులో దేశీయంగా పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలని కేంద్రం నిర్ణయించింది. సాగు చేసిన రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. దేశంలో 2022-27 వరకు పామాయిల్ సాగు విస్తరించాలని సంకల్పించారు. ఒక్క మన జిల్లాలోనే 1500 హెక్టార్లలో కొత్తగా పామాయిల్ తోటలు పెంచాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను వైసీపీ హయాంలో చెల్లించలేకపోయారు. ఇప్పుడిప్పుడే బకాయిలు విడుదలవుతున్నాయి. ఈ ఏడాది 300 హెక్టార్లలో సాగు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో తాడేపల్లిగూడెం, మొగల్తూరు. నర్సాపురం, పాలకొల్లు మండలాల్లో పామాయిల్‌కు అవకాశం ఉంది. ప్రతి హెక్టార్‌కు మొక్కలు నాటిన తర్వాత ప్రభుత్వం రూ.29 వేలు చెల్లిస్తుంది. ఎరువులు, ఇతర అవసరాల కోసం రూ.10,400 మంజూరు చేస్తారు. నాలుగు సంవత్సరాల పాటు రూ.10,400 రైతులకు చెల్లిస్తారు. మొక్కలు నాటేందుకు రూ.29వేలు ప్రభుత్వం ఇవ్వనుంది. దాంతో జిల్లాల్లో లక్ష్యాన్ని చేరేందుకు ఉద్యానశాఖ చర్యలు తీసుకుంటోంది.తాడేపల్లిగూడెం రూరల్ మండలం జగ్గన్నపేటలో రైతు పులి సూర్యప్రసాద్‌కు చెందిన 12 ఎకరాల్లో పామాయిల్ సాగుకు మొక్కలు నాటారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి దేవానంద్ కుమార్, ఉద్యానశాఖ డివిజన్ అధికారి శ్రీలక్ష్మి, త్రిబుల్ ఎఫ్ కంపెనీ డీజీం విజయప్రసాద్, రైతులు ఏడుకొండలు, సత్యనారాయణ, కృష్ణ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

బుసలు కొడుతున్న కాల్ మనీ

పేదలు, మధ్యతరగతి వారే టార్గెట్

అధిక వడ్డీలు పేరుతో దోచుకుంటున్న దళారులు

భీమవరం క్రైం, ఆగస్టు 19 : కొంతకాలంగా సద్దుమనిగిన కాల్ మనీ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. పేదలు, మధ్య తరగతి వారే టార్గెట్‌గా వడ్డీలకు డబ్బులిచ్చి తర్వాత వారిని పీక్కు తింటున్నారు. వడ్డీల మీద వడ్డీలు వేసి వారిని సర్వనాశనం చేస్తున్నారు. దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. గతంలో బాధితులు ఫిర్యాదు చేస్తే వారిపై కాల్ మనీ కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపేవారు. దీంతో చాలా మంది దళారులు భయపడి అదనపు వడ్డీలు వసూలు చేయడం మానేశారు. ఇటీవల మళ్లీ ఈ వ్యవహారం తెరపైకి వచ్చింది. డబ్బులు ఇచ్చేటప్పుడు చెక్‌లు, నోట్‌లు తీసుకుని వారు పూర్తిగా సొమ్ము చెల్లించినా కూడా అదనంగా డబ్బులు కట్టాలంటూ మెడపై కత్తి పెడుతున్నారు. ఒకరికి రూ.10 వేలు కావాలంటే ముందుగా వడ్డీ రూపంలో రూ.2 వేలు తీసుకుని చేతికి 8 వేలు ఇస్తారు. ఆ సొమ్మును 100 రోజుల్లో కట్టాలి. గడువు దాటితే వారి నుంచి మరో రూ.4 వేలు అదనంగా వసూలు చేస్తారు. దీంతో పేద, మధ్యతరగతి వారు రోడ్డున పడుతున్నారు.



భీమవరంలో దోపిడీ జోరు

భీమవరం పట్టణంలో సుమారు 500 మంది ఈ వ్యాపారంలో ఆరితేరి ఉన్నారు. అదనపు వడ్డీలు వసూలు చేసిన దళారుల్లో రాజకీయ నేతలు కూడా ఉండటం గమనార్హం. ఎన్నికల్లో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీకి కొమ్ము కాసేవారి సపోర్టుతో ఇలాంటి వ్యవహారాలు చేస్తున్నారు.

- భీమవరం 20వ వార్డుకు చెందిన ఒక వ్యక్తి తన కూతురి వివాహం నిమిత్తం ఒక దళారి వద్ద రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. దానికి ఆ దళారి ముందుగానే రూ.10 వేలు వడ్డీగా తీసుకుని మిగిలిన రూ.40 వేలు ఇచ్చాడు. రోజుకు 500 చొప్పున 100 రోజుల్లో కట్టేలా మాట్లాడుకున్నారు. కానీ ఆ వ్యక్తికి వచ్చే రోజు కూలీ రూ.700. కొంతకాలం రూ.500 కొంత కాలం కట్టిన తరువాత అతని తల్లికి అనారోగ్యం రావడంతో ఆసుపత్రిలో వేల రూపాయిలు ఖర్చు పెట్టాడు. దీంతో ఆ దళారి ఒత్తిడి తెచ్చి అతని పేరున ఉన్న సెంటు భూమిని రాయించుకున్నాడు.
- భీమవరం 18వ వార్డుకు చెందిన ఒక మహిళ తన భర్త మద్యానికి బానిసై జూదాలు ఆడి కొన్ని లక్షలు రూపాయలు పోగొట్టాడు. ఆ అప్పులు తీర్చడానికి ఆ మహిళ ఒక దళారి వద్ద లక్ష రూపాయలు అప్పుగా తీసుకుంది. దళారి ముందుగా రూ. 80 వేలు ఇచ్చి రూ.20 వేలు వడ్డీ రూపంలో తీసుకున్నాడు. ఆ మహిళ కట్టలేకపోవడంతో ఆ మహిళ ఇచ్చిన చెక్ నోట్‌ను కోర్టులో వేసి ఆమెను కోర్టు చుట్టూ తిప్పుతున్నాడు. ఇలా చాలా మంది బాధితులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

అధిక వడ్డీలు వసూలు చేస్తే కేసులు

జి.కాళీచరణ్, భీమవరం టూటౌన్ సీఐ



ఎవరైనా అధిక వడ్డీలు వసూలు చేసి బాధితులను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై కాల్‌మనీ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అలాంటి ఫిర్యాదులు అందాయి. వాటిపై చర్యలు తీసుకున్నాం. ఎవరైనా అధికంగా వడ్డీలు వసూలు చేసి ఇబ్బందులకు గురి చేస్తే నేరుగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

క్రైం కార్నర్

అత్యాచారయత్నంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల, ఆగస్టు 19: మండలంలోని రామసింగవరానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన శ్రీను అనేవ్యక్తి దాడి చేసి అత్యాచారయత్నం చేసినట్లు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. పొలంలో పని చేసుకుంటుండగా ఆదే గ్రామానికి చెందిన శ్రీను మహిళను లాక్కుని వెళ్లి కొట్టి గాయపరిచి అత్యాచారయత్నం చేశాడని స్థానికుల సాయంతో ఆమె జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో చేరిందని తెలి పారు. అక్కడ నుంచి వచ్చిన ఎంఎల్‌సి ఆధారంగా శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.





గట్టుపై బైక్

పెరుగుగూడెం పోలవరం కాల్వ గట్టు సమీపంలో మృతి చెందిన శేషయ్య

కాల్వలో పడి ఒకరి మృతి

దెందులూరు,ఆగస్టు 19: మండలంలోని పెరుగుగూడెం, చల్లచింతలపూడి గ్రామాల మధ్య పోలవరం కాల్వ గట్టు పక్కన నీటిగుంటలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుడు నల్లజర్ల మండలం కంసాలకుంట గ్రామానికి చెందిన పదిలం శేషయ్య (32) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.భార్య ఇటీవల మృతి చెందింది.శనివారం బంధువుల గ్రామమైన చల్లచింతలపూడి వచ్చాడు. శనివారం రాత్రి భోజనం చేసి ఉదయమే హైదరాబాద్ డ్రైవింగ్‌కు వెళ్లాలని చెప్పి పడుకున్నాడు. ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో కంసాలకుంట బయలు దేరాడు. ఏంజరిగిందో తెలియదు గానీ నీటిలో పడి మృతి చెంది ఉన్నాడు. బండి కాల్వ గట్టుపైనే ఉంది. సోమవారం ఉదయం వాహనదారులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాద వశాత్తు పడిపోయాడా అన్నది తెలియాల్సి ఉంది.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 19 : బాకీ సొమ్ములు తీసుకుని తిరిగి ఇవ్వమని అడిగిన మహిళను కులంపేరుతో దూషించారనే అభియోగంతో ముగ్గురిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ళలోని సుంకరవారిగూడేనికి చెందిన అరుగుల ఉషారాణి వద్ద పెదవేగి మండలం వంగూరుకు చెందిన కొట్టాడ శ్రీనివాస్ దఫదఫాలుగా మూడు లక్షల రూపాయలు అప్పు తీసుకున్నారు. ఆ సొమ్ములు చెల్లించాలని తన ఇంటికి వెళ్లి అడిగింది. ఆ సమయంలో శ్రీనివాస్ ఇంటి వద్ద లేదు. మరుసటి రోజు ఉషారాణి ఇంటికి శ్రీనివాస్, కొట్టాడ శిరీష, కొట్టాడ సుబ్బారావులు ముగ్గురు వచ్చి కులంపేరుతో దూషించి దుర్భాషలాడారు. సొమ్ములు చెల్లించమని ఏం చేస్తావో చేసుకోమని బెదిరించారు. దీంతో బాధితురాలు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ముగ్గురిపై సోమవారం రాత్రి అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బైనేరు కాల్వలో పడి రైతు మృతి

కొయ్యలగూడెం, ఆగస్టు 19: బైనేరు కాల్వలో పడి రైతు మృతి చెందాడు. కొయ్యలగూడం మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన అడపా అంకాలయ్య (55) తన గోవులను కాల్వలో తోలుకుని బైనేరు కాల్వ ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆ కాల్వలో కొట్టుకుపోయాడు. అనంతరం పోలీసులు, గ్రామస్థులు గాలించగా మృతదేహం లభించింది.

ఫోన్‌పే చేయండి..డబ్బులు పంపిస్తా..

ఏఎస్ఐనంటూ ఫోన్..

ద్వారకాతిరుమల, ఆగస్టు 19: ఘరానా, సైబర్ క్రైమ్‌లు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ద్వారకాతిరుమలలో ఇటీవల ఘరానా మోసానికి ఓ వ్యాపారి మోసబోగా మరో వ్యాపారి, ఓ ఉద్యోగి చాకచక్యంగా తప్పించుకున్నారు. ఇటీవల కొందరు కేటుగాళ్లు ద్వారకాతిరుమలకు చెందిన ఓ వ్యాపారిని బురిడీ కొట్టించారు. దాదాపు నెలక్రితం ఆయనకు ఫోన్ చేసి తాను పోలీసునని తనకు అర్జంట్‌గా డబ్బు కావాలని రూ.45 వేలు ఫోన్‌పే చేస్తే ఆ డబ్బును కానిస్టేబుల్ ద్వారా పంపిస్తానని నమ్మబలికాడు. వ్యాపారి నమ్మి ఫోన్‌పే చేశాడు. కానీ కానిస్టేబుల్ రాలేదు.. ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. మోసబోయానని గ్రహించి చేసేది లేక గమ్మునుండి పోయాడు. తాజాగా ఓ కేటుగాడు ద్వారకాతిరుమలలోని ఓఫంక్షన్ హాల్ యజమానికి, సొసైటీ కార్యదర్శి కిషోర్‌కు ఫోన్‌చేసి తాను ఏఎస్ఐనని తమ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంకు యాక్సిడెంట్ అయ్యిందని రూ.50 వేలు ఫోన్‌పే చేస్తే మరో కానిస్టేబుల్‌తో పంపిస్తానని నమ్మబలికాడు. అయితే అప్రమత్తమైన కార్యదర్శి కిషోర్ ముందుగా నగదు పంపండి అప్పుడు ఫోన్‌పే చేయిస్తామని చెప్పడంతో సదరు కేటుగాడు కిక్కురుమనకుండా సైలెంట్ అయ్యాడు.

మెరుగు పేరుతో బంగారం కొట్టేస్తారు

రెచ్చిపోతున్న ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠా



భీమవరం క్రైం, ఆగస్టు 19: బంగారం మెరుగుపెడతామంటూ ఇంటికి వచ్చి మాయమాటలు బంగారం దోచుకుపోతున్న ముఠాలు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పటికి ప్రజల్లో మాత్రం అవగాహన రావడం లేదు. భీమవరం మండలం రాయలం గ్రామంలో ఇటీవల ఇలాంటి దోపిడీ చోటుచేసుకుంది. ఉప్పగుంటచెర్వు ప్రాంతానికి చెందిన చిట్టిగుళ్ళ మణి అనే మహిళ వద్దకు రెండురోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు వచ్చారు. బంగారం, వెండి వస్తువులు మెరుగు పెడతామని చెప్పడంతో ఆమె తన కాళ్ళ పట్టీలు ఇచ్చింది. మెరుగు పెట్టి ఇచ్చేశారు. అనంతరం మెడలో ఉన్న సూత్రాల తాడు నల్లగా ఉందని మెరుగు పెడతామని చెప్పడంతో తాడు కూడా ఇచ్చింది. వారు వెంట తెచ్చుకున్న కెమికల్స్‌లో ముంచి వెనక్కి ఇచ్చారు. ఇచ్చే ముందు ఆ తాడుకు పసుపు రాశారు. తూకం తగ్గినట్లుగా అనుమానం రావడంతో ఆ మహిళ వారిని నిలదీయడంతో మహిళను గెంటేసి పారిపోయారు. భర్త ఇంటికి వచ్చాక విషయం చెప్పడంతో ఆ వస్తువును బయటకు తీసుకువెళ్లి తూకం వెయ్యగా నాలుగు గ్రాములు తగ్గింది. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై టూటౌన్ ఎస్ఐ రహ్మాన్ కేసు నమోదు చేశారు. అయితే మెరుగు పెడతామని వచ్చిన వారు బిహార్‌కు చెందిన ముఠాగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.బంగారు ఆభరణాలు,వెండి వస్తువులు పాతబడినా మెరుగుపోయినా అవి ఎక్కడైనా మెరుగు కోసం ఇచ్చేటప్పుడు తప్పకుండా తూకం వేసిన తరువాత ఇవ్వాలి. ఎంత తెలిసిన షాపు అయినా ముందుగా తూకం చూసి మెరుగు అయిన తరువాత కూడా తూకం చూసుకోవాలి.

ఇసుక అక్రమ రవాణా.. ట్రాక్టర్ సీజ్

ముసునూరు, ఆగస్టు 19: మండలంలోని బలివే తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ముసునూరు పోలీసులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. ముసునూరుకు చెందిన నక్కా వెంకటేశ్వరరావు తన ట్రాక్టర్‌తో అనుమతులు లేకుండా తమ్మిలేరు నుంచి ఇసుకను లోడ్ చేసుకుని ముసునూరు తరలిస్తుండగా గోపవరం శివారు నాగేంద్రపురం సెంటర్ వద్ద దాడిచేసి పట్టుకున్నట్లు ఏఎస్సై నాగభూషణరావు తెలిపారు.

నగర పంచాయతీ పరిధిలోనే ఉంచాలి

ఆకివీడు రూరల్ ఆగస్టు 19: కుప్పనపూడి పంచాయతీ పరిధిలోని తాళ్ళకోడులోని ఇళ్ళస్థలాల లబ్ధిదారులు తమను ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోనే ఉంచాలని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. తామంతా ఆకివీడు నగర పంచాయతీకి చెందినవారమేనని, తమ వద్ద నుంచి పన్నులు వసూలు చెయ్యాలని కోరారు. మౌళిక వసతులైన తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. స్పందించిన డీఆర్వో జె.ఉదయ్ భాస్కరరావు నగర పంచాయతీ కమిషనర్‌కి ఫోన్ చేసి వాటర్ ట్యాంకర్ పంపమని ఆదేశించారు.

పరిశుభ్రమైన నీరందించేందుకు చర్యలు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్, ఆగస్టు 19: నియోజక వర్గ ప్రజలకు శుద్ధమైన తాగు నీటిని అందించే ందుకు ప్రత్యేక చర్యలు చేపడుతు న్నట్లు ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. సోమవారం కొప్పర్రు గ్రామంలో రూ.80 లక్షలతో చేపట్టే ఫిల్టర్‌బెడ్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇప్పటికే భారీ ప్రాజెక్టుల్లో పరిశీలించి కలుషిత నీరు సరఫరా కాకుండా ఏం చర్యలు చేపట్టాలన్న దానిపై ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అన్ని చెరువుల్లో ఫిల్టర్‌బెడ్‌లను ఆధునీకరిస్తామన్నారు. అనంతరం సీతారాంపురం సౌత్ గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆ తరువాత తహసీల్దార్లతో సమావేశమై సమస్యలపై సమీక్షించారు. పెండింగ్ ప్రాజెక్టులకు భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి జయలక్ష్మి, అందే కవి, పోలిశెట్టి శ్రీనివాస్, చింతపల్లి శ్రీనువాస్, బాబూరావు పాల్గొన్నారు.

పట్టణంలో అప్రోచ్ రహదారులు నిర్మించాలి

నరసాపురం టౌన్, ఆగస్టు 19: పట్టణంలోని 216 జాతీయ రహదారి వెంబడి అప్రోచ్ రహదారులు నిర్మించాలని రాష్ట్ర దళిత నాయకులు తెన్నేటి సురేష్ ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏవో రామకృష్ణ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు అందుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ లాకుపేట, రాయపేట, రుస్తుంబాదా ప్రాంతాల్లో అప్రోచ్ రహదారులు లేకపోవడం వల్ల వాహనదారులు జాతీయ రహదారి ఎ

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఫలప్రదం కావాలి


మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు

కాళ్ళ, ఆగస్టు 19 : నెలకు ఒకసారి జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను విజయవంతం చేయాలని భీమవరం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పిల్లలు ఆశించిన సామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని కోరారు. చక్కని బోధన, అభ్యసన సామగ్రి తయారు చేసుకుని ఉపయోగించడం ద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చని ఆయన అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు రవీంద్ర, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు తల్లిదండ్రులు బాధ్యతను కూడా గురువులే తీసుకొని వారి ఉన్నతికి కృషి చేయాలన్నారు.

విద్యార్థి ప్రగతికి స్కాలర్‌షిప్ దోహదం

కాళ్ళ, ఆగస్టు 19 : జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ సాధిస్తే ఉన్నత చదువుల వరకు ఆ స్కాలర్‌షిప్ విద్యార్థి ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని పలువురు అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ సాధన అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం నిర్మలాదేవి, మ్యాథమెటిక్స్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్, ఐక్య ఫౌండేషన్ ఛైర్మన్ వై.శ్రీనివాసాచారి, వందేమాతరం ఫౌండేషన్ ఏపీ ఛైర్మన్ పేరిచర్ల అశోక్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

కాళ్ళ, ఆగస్టు 19 : కాళ్ళ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మండలంలోని 21 పంచాయతీల సర్పంచ్, కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో జి.స్వాతి తెలిపారు. తొలి రోజు డీపీఆర్సీ రామలక్ష్మీ హాజరై సర్పంచ్, కార్యదర్శులకు పరిపాలనపై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: గ్రామాలు సంపూర్ణపారిశుధ్యం సాధించే దిశగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పని చేయాలని మొగల్తూరు ఎంపీడీవో వి.బాబ్జిరాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించారు. గ్రామాలు సంపూర్ణ పారిశుధ్యసాధన కోసం సర్పంచ్, కార్యదర్శులతో ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణా తరగతుల్లో ఈవోఆర్డీ నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శులు ఐఎస్ఎన్ రాజు, సాయి శేఖర్, వై.కృష్ణ పాల్గొన్నారు.

రేపు వర్గీకరణకు వ్యతిరేకంగా బంద్

భీమవరం అర్బన్, ఆగస్టు 19: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 21వ తేదీన దేశవ్యాప్త బంద్‌కు దళిత జేఏసీ మద్దతు ప్రకటిస్తున్నదని దళిత సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం దళిత జేఏసీ పట్టణ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి న్యూటన్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 21న జరిగే భారత బంద్‌కు వ్యాపార, విద్యాసంస్థల యాజమాన్యం, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆచంట: వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు, ఇతర సంఘాలను కలుపుకుని ఈ నెల 21న భారత్‌బంద్‌కు పిలుపు నివ్వడం జరిగిందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ బంద్‌లో పెద్ద ఎత్తున పాల్గొని వర్గీకరణ వద్దు కలిసి ఉంటే ముద్దు అనే నినాదంతో దళితులందరూ ఏకమై పోరాటం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు.

పాలకొల్లు అర్బన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ఇచ్చిన తీర్పు పునఃపరిశీలన చేయాలని మాలమహానాడు నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో సోమవారం జరిగిన మాలల జేఏసీ సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్, పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ వర ప్రసాద్ మాట్లాడారు. ఈనెల 21వ తేదీన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

అన్నక్యాంటీన్ ఏర్పాటుకు స్థలం పరిశీలన


అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామ

ఉండి ఆగస్టు 19: ఉండి ప్రధాన సెంటర్‌లో వున్న ఆర్‌అండ్‌బీ బంగ్లాలో అన్నక్యాం టీన్‌ని ఏర్పాటు చేసుకుందామని, ఇది ప్రజలకు ఎంతో అనువుగా వుందని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం ఆయన ఆప్రాంతానికి విచ్చేసి పరిశీలించారు. మరో రెండుచోట్ల అన్నక్యాంటీన్ పెట్టడానికి స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, కళ్లేపల్లి సతీష్, ఈవోపీఆర్‌డీ రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో చిరంజీవి జన్మదిన వేడుకలు

పెంటపాడు, ఆగస్టు 19: ప్రత్తిపాడులో చిరంజీవి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. జనసేన నాయకులు జగత్ సోమశేఖర్, మట్టా రాంబాబు ఆధ్వర్యంలో వై.జంక్షన్ వద్ద దుర్గమ్మకు పూజలు చేశారు. ఇటీవల వర్షాలకు ప్రత్తిపాడులో ఇంటిని కోల్పోయిన మజ్జి వెంకటరత్నంకు రూ. 30 వేలు నగదు అందజేశారు. రాష్ట్ర చిరంజీవి యువత కార్యదర్శి గట్టు గోపీకృష్ణ, రౌతు సోమరాజు, ఫుల్లా బాబి, సజ్జా సుబ్బు, రుద్ర రమేష్, మజ్జి అప్పారావు, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.




మాజీ ఎమ్మెల్సీ అంగరకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు.. భీమవరం బధిర పాఠశాలలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు... సిద్ధాపురం పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థులు

వేడుకగా అన్నాచెల్లెళ్ల పండుగ

పాలకొల్లుఅర్బన్/ పాలకొల్లు రూరల్, ఆగస్టు 19: రాఖీ పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలో పలువురు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీసులు అందుకున్నారు. పలు సేవా సంస్థలు, ఓం శాంతి (బ్రహ్మకుమారీలు) సరస్వతి శిశుమందిరం, విద్యాభవన్స్ విద్యార్థులు రాఖీ పండుగను జరుపుకున్నారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేని రోజారమణి, నాయకురాళ్ళు ద్రాక్షారపు జ్యోతి, బత్తుల మేరీ నిర్మల కుమారి, అన్నపూర్ణ, విజయలక్ష్మీ, సుజాత తదితరులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్‌ఆర్‌పేటలోని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌కు పలువురు తెలుగు మహిళలు, బ్రహ్మకుమారీ సభ్యులు రాఖీలు కట్టారు. అలాగే పలు ఆలయాల్లో భక్తులు రక్షా బంధన్ పేరుతో రాఖీలు కట్టారు.

ఆకివీడు రూరల్: విద్యార్థుల మధ్య సోదరభావం పెంపొందేందుకు రక్షాబంధన్ దోహదపడుతుందనే ఉద్దేశంతో పాఠశాలలో రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించామని ఉపాధ్యాయులు తెలిపారు. ఆకివీడు మండలం సిద్ధాపురంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థినీలు రాఖీ కట్టారు. చదువుకునే వయస్సు నుంచే పిల్లలకు అన్ని విషయాలు పట్ల విషయ పరిజ్ఞానం నేర్పించాలని సదుద్దేశంతో ఈకార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయురాలు ప్రసన్నదుర్గ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: భీమవరంలోని శ్రీ వెంకటేశ్వరా బధిర ఉన్నత పాఠశాలలో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బధిర విద్యార్థులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అల్లుశ్రీనివాస్, స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మి నరసమ్మ, మానవతా భీమవరం శాఖ సభ్యులు గ్రంధి కుమార్, వరప్రసాద్, చాన్ బాషా పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: రాఖీ పండుగ సందర్భంగా పట్టణ టీడీపీ కార్యాలయంలో సందడి నెలకొంది. తెలుగు మహిళలు పెద్ద ఎత్తున వచ్చి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జికి, ఇతర నాయకులకు రాఖీలు కట్టారు. తెలుగు మహిళలు దాసరి కృష్ణవేణి, కొండ్రెడ్డి హైమవతి, రమావతి, సుభద్ర పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం బాలికల హైస్కూల్‌లో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్యామల ఆధ్వర్యంలో మహిళలకు, విద్యార్థినిలకు రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. రాఖీలు కట్టిన మహిళలకు కానుకలు సమర్పించి దీవెనలు పొందారు. గణపవరంలో స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు రాఖీలు కట్టి మిఠాయిలు పంపిణీ చేశారు.

గత చరిత్రకు చిహ్నాలు ఛాయాచిత్రాలు

సీనియర్ ఫొటో గ్రాఫర్లకు సత్కారం


భీమవరంలో ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న దృశ్యం


భీమవరంలో చిన్నారులకు భోజనాలు పెడుతున్న ఫొటోగ్రాఫర్లు

భీమవరం రూరల్, ఆగస్టు 19 : గత చరిత్రకు చిహ్నాలు ఛాయాచిత్రాలేనని, కెమెరా సృష్టికర్త లూయిస్ డాకురే కెమెరా కనుగొనకపోతే చరిత్రకు చిహ్నాలు లేవని టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారథి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోళ్ళ నాగేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో భీమవరం ఏరియా ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సహకార సౌజన్యంతో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు తిరుమాని సత్యనారాయణ (చిట్టిబాబు), ఛైర్మన్ ఎస్‌నాగు, కార్యనిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ప్రసంగించారు. అనంతరం 16 మంది సీనియర్ ఫొటోగ్రాఫర్లను ఘనంగా సత్కరించారు.

నరసాపురం టౌన్: ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని పట్టణ, మండలంలోని ఫొటోగ్రాఫర్లు సోమవారం ఘనంగా నిర్వహించారు. శివాలయం సెంటర్‌లోని డాగురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. సంఘం నాయకులు కేపిటల్ రాజు, రాంబాబు, బాలకృష్ణనారాయణ, గౌస్, రమేష్, రామారావు, గోపి, వెంకట్ పాల్గొన్నారు.

ఆచంట: ప్రపంచ ఫొటోగ్రఫీ డేను సోమవారం ఆచంట మండల ఫొటోగ్రఫీ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంకటాల సుబ్రహ్మణ్యంను సన్మానించారు.

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ఏరియా ఫొటో, వీడియో గ్రాఫర్లు, మిక్సింగ్, లామినేషన్, అల్బం డిజైనర్స్ ఫ్లెక్సీ ప్రింటింగ్, కలర్ ల్యాబ్స్‌ల సంఘం భవనం వద్ద సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు పెచ్చెట్టి శ్యాంబాబు అధ్యక్షత వహించారు. ముందుగా సీనియర్ రిపోర్టర్ గూడూరి బాలాజీ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన డాగురే విగ్రహాన్ని ఆవిష్కరించారు.

భీమవరం ఎడ్యుకేషన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ భీమవరం యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం చినఅమిరంలోని ఇమాన్యుల్ అనాధ ఆశ్రమంలో 50 మంది చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు మద్దాల ఏసు ప్రసాద్, సెక్రటరీ బచ్చల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు కొండేటి దక్షిణామూర్తి పాల్గొన్నారు.

వైద్యురాలిపై హత్యాచారం నిరసిస్తూ ర్యాలీ


ఉండిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 19: మహిళలను వక్రంగా చూడాలంటేనే ప్రతి ఒక్కరూ భయపడేలా చట్టం రూపొందించాలని ఐసీడీఎస్ సిబ్బంది నినదించారు. తాడేపల్లిగూడెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కోల్‌కతలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. తాలూకా కార్యాలయ కూడలిలో మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్. దుర్గాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

పెంటపాడు: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని నాయకులు జే.శ్యామలాకుమారి, సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడీలు ప్ల కార్డులు చేతపట్టుకుని పెంటపాడు సెంటర్‌లో నిరసన తెలిపారు.

నరసాపురం టౌన్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ సోమవారం పట్టణంలోని సెంట్‌ఆన్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేశారు. పాతబజార్ నుంచి పురవీధుల్లో ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ముందుగా కొద్దిసేపు గేట్ వద్ద సంతాపం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నాయకర్‌కు వినతిపత్రం అందించారు.

ఉండి: పశ్చిమబెంగాల్‌లో మహిళ డాక్టరు హత్య దారుణమని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు తీవ్రంగా ఖండించారు. సోమవారం రాత్రి ఉండిలోని గాంధీ విగ్రహానికి పూలమాలవేసి అక్కడి నుం చి చిన్నవంతెన సెంటర్, బల్లవంతెన సెంటర్ మీదుగా పెద్దవంతెన సెంటర్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. జనసేన కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పెనుమంట్ర: కోల్‌కతాలో జరిగిన అత్యాచార దుర్ఘటనను నిరసిస్తూ పెనుమంట్ర పీహెచ్‌సీ వైద్యులు ధర్నా నిర్వహించారు. డ్యూటీలో ఉన్న డాక్టర్‌లకే రక్షణ లేకపోతే వైద్యం ఎలా అందించాలని వాపోయారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ జ్యోతి, హెచ్ఎస్ మల్లేశ్వరరావు, ఎల్‌టి మూర్తి, రేవతిరెడ్డి, గుండె సురేష్‌బాబు, వీవీ పాలెం, వీరమ్మ పాల్గొన్నారు.

భీమవరం రూరల్: మహిళలపై జరుగుతున్న హత్యలకు అంతు లేదా, శాశ్వత పరిష్కారానికి మార్గం చూడాలని 32 డెంటల్ కేర్ హాస్పిటల్ డా.గౌతమ్ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా శ్రీవిజ్ఞానవేదిక, వండర్ కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం మెంటేవారితోటలో ధర్నా నిరసన ర్యాలీ నిర్వహించారు.

నరసాపురం: కోల్‌కతా ఘటనను నిరసిస్తూ సోమవారం రాత్రి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. యూటీఎఫ్ కార్యాలయం నుంచి మొగల్తూరు రోడ్డులోని థామస్ వంతెన వరకు ప్రదర్శన చేశారు. అక్కడ కొద్ది సేపు నిరసన తెలిపారు.

అద్దేపల్లి దాతృత్వం స్ఫూర్తిదాయకం


ఆర్యవైశ్య ప్రముఖులను సన్మానిస్తున్న మంత్రి

పాలకొల్లు టౌన్, ఆగస్టు 19: స్వాతంత్ర్య సమరయోధులు, విద్యాదాత అద్దేపల్లి సత్యనారాయణమూర్తి దాతృత్వం పాలకొల్లు చరిత్రలో స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో సోమవారం కోకోనట్ మర్చంట్ ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహి ంచారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్‌చేశారు. సేవాకార్యక్రమాల్లో భాగంగా ఆయ న రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి నిమ్మల ఆర్యవైశ్య ప్రముఖులను సన్మానించారు. మాజీఎమ్మెల్యే బంగారు ఉషారాణి, ప్రిన్సిపాల్ బి.అప్పారావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా బీజేపీ ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, రోజారమణి, టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు పాల్గొన్నారు.

వైభవంగా వ్యాస పూర్ణిమ పూజలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 19: తాడేపల్లిగూడెంలోని శంకర మఠంలో ఉమా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో వ్యాసపూర్ణిమ సందర్భంగా సోమవారం స్వామివారికి విశేషార్చనలు నిర్వహించారు. అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ ర్యాలీ

తణుకు, ఆగస్టు 19: పట్టణంలో పలు కళాశాలలు, భాష్యం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ కమిషనర్ బి.వి.రమణ జెండా ఊపి ప్రారంభించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలి, పర్యావరణాన్ని పరిరక్షించాలి అంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. మానవత శాంతి ర్యాలీ జిల్లా ఛైర్మన్ గమిని రాంబాబు, నాయకులు కరారి శారదాదేవి, బి.రామకాశి, అక్కిన కాశి, ఆనందం మస్తాన్‌రావు, బాలాజీ, రామకృష్ణ, సతీష్‌బాబు, వంగూరి హనుమంతరావు. డా. సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతికశ్రీకి బీజేపీ నాయకుల అభినందన

తణుకు, ఆగస్టు 19: అథ్లెట్ జ్యోతికశ్రీ ఒలింపిక్స్‌లో పాల్గొని తణుకు విచ్చేసిన సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ జ్యోతికశ్రీని ఆమె నివాసంలో కలసి అభినందించారు. జ్యోతికశ్రీని స్ఫూర్తిగా తీసుకుని యువత క్రీడల్లో రాణించాలన్నారు. బీజేపీ నాయకులు ఐ.శ్రీదేవి, పెదమల్లు అవినాష్ కాంత్, బొల్లాడ నాగరాజు, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

శంకర మఠంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 19 : శంకర మఠంలో ఈనెల 20వ తేదీ నుంచి 23 వరకూ ప్రవచనకర్త చాగంటి లింగరాజు సనాతన ధర్మంపై ప్రవచనాలు ఏర్పాటు చేసినట్టు ప్రోగ్రాం ఆఫీసర్ కె.రాజ గోపాలరావు, ప్రోగ్రాం అసిస్టెంట్ హెచ్‌డీపీపీ డాక్టర్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, మఠం కమిటీ సభ్యులు సత్తిరాజు కేశవరావు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు అనంతరం భజనలు ఉంటాయని 23వ తేదీ ఉదయం మహిళల ఆధ్వర్యంలో వరలక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు, గోపూజ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి

మొగల్తూరు, ఆగస్టు 19: వరి సాగు రైతులు తమ సార్వా పంటను విధిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సూచించారు. సోమవారం ఆయన మొగల్తూరులో వీఆర్వో, వ్యవసాయ సిబ్బందితో క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నమోదు ప్రక్రియను చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాట్లు వేసిన రైతులు రైతు సేవా కేంద్రాలు, లేదా వీఆర్వోలతో ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు పంటకు సంబందించి ఈక్రాప్ నమోదు చేయించుకుంటే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ధాన్యం అమ్ముకునేందుకు రైతులకు లబ్ధికలుగుతుందన్నారు.

పెనుగొండ: ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి స్పందన అన్నారు. సోమవారం మండలంలో పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట రకం, విత్తన రకం, తదితర సర్వే నెంబర్లు వారీగా నమోదు చేయించుకోవాలన్నారు.

బాలికల రక్షణపై విద్యార్థుల ర్యాలీ



తణుకు, ఆగస్టు 19 : రాఖీ పూర్ణిమ పండుగ సందర్భంగా సోమవారం తణుకు సజ్జాపురంలోని ఆదిత్య స్కూల్ విద్యార్థులు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలు పుతూ 'బాలికల రక్షణ- బాలికల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బాలికలు, మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టాలు చేయాలంటూ నినదించారు. కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గురుజు ఆదిశేష, అకడమిక్ డైరెక్టర్ రమాకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 19 : స్థానిక మన్యం జగ్గమ్మగారి సత్రం సేవా కార్యక్రమాల్లో భాగంగా బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్ విద్యార్థినీలు 300 మందికి ఒక్కొక్కరికి రెండేసి లాంగ్ బుక్కులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్రం కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, వార్డు మాజీ కౌన్సిలర్ జగ్గురోతు రాంబాబు, నాయకులు వట్టం గణేష్ పాల్గొన్నారు.

వనమల్లికార్జునుడికి జలాభిషేకం



మొగల్తూరు, ఆగస్టు 19: శ్రావణమాసం పురస్కరించుకుని మొగల్తూరు వడయార్‌పేటలోని వన మల్లికార్జునుడికి సోమవారం జలాభిషేకం నిర్వహించారు. 25 కావిడిలతో నరసాపురం గోదావరి నుంచి జలాన్ని తీసుకువచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. గ్రామంలోని పలు ప్రాంతాల నుండి భక్తులు కావిడిలతో తీసుకువచ్చిన జలాన్ని స్వామి వారికి అభిషేకించారు.

పెంట్లమ్మ ఆలయానికి వలవల విరాళం



పెంటపాడు, ఆగస్టు 19: రాఖీ పండుగ సందర్భంగా కే.పెంటపాడు పెంట్లమ్మ వారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి దంపతులు చీర, సారె తీసుకువెళ్ళి అమ్మవారిని దర్శించుకున్నారు. బాబ్జి ఆలయానికి రూ. 50,116 లు విరాళంగా అందజేయగా ఆలయ కమిటీ ఛైర్మన్ పంతం శేఖర్ ఆధ్వర్యంలో బాబ్జి దంపతులను సత్కరించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, దాసరి అప్పన్న, దాసరి కృష్ణవేణి, మల్లెల ప్రసాద్, నరాలశెట్టి సంతోష్‌కుమార్, చోడగిరి ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ అన్నదానానికి విరాళం

భీమవరం రూరల్, ఆగస్టు 19 : మావుళ్ళమ్మ అమ్మవారికి శాశ్వత నిత్యాన్నదానానికి సోమవారం నాడు భీమవరానికి చెందిన ఎం.నాగశివసాయితేజ, మౌనికదుర్గసాయి వాసవి దంపతులు రూ.56వేల ఒక రూపాయి విరాళం అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి రామ్‌చరణ్



పెనుగొండ, ఆగస్టు 19: పెనుగొండలో 1 నుంచి 10 వరకు విద్యనభ్యసించిన పెనుగొండకు చెందిన శ్రీ రామ్ చరణ్ ట్రిపుల్ ఐటీ నూజివీడులో ప్రవేశానికి అర్హత సాధించాడని భాష్యం ప్రిన్సిపాల్ ఎస్. వెంకట అప్పారావు తెలిపారు. మండలం నుంచి ట్రిపుల్ ఐటీకి ఒకే ఒక్క విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు.

అదృశ్యమైన యువకుడి అప్పగింత

పెనుమంట్ర, ఆగస్టు 19: పెనుమంట్రలో గత ఏడాది మే నెల 20న తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి అదృశ్యమైన యువకుడు 17 నెలలు తరువాత ఇంటికి చైల్డ్ వెల్ఫేర్ అధికారులు చేర్చారు. సరిగ్గా చదువుకోవడం లేదని తండ్రి మందలించడంతో ఆ యువకుడు గూడూరు రైల్వేస్టేషన్‌లో చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు తారసపడ్డాడు. వివరాలు సేకరించగా తల్లిదండ్రులు లేరని అనాధనని చెప్పడంతో అధికారులు హోమ్‌కు తరలించారు. 17 నెలలు తరువాత యువకుడికి ఇంటి దగ్గర తల్లిదండ్రులు పైన బెంగ రావడంతో అధికారులకు తల్లిదండ్రులు ఉన్నారని జిల్లా పెనుమంట్ర స్వగ్రామం అని చెప్పడంతో తల్లిదండ్రులకు అప్పగించారు. ఆ యువకుడి పేరు సురేశ్. ప్రస్తుతం అతని వయస్సు 14 సంవత్సరాలు.

సాయిబాబుకు గిడుగు రామ్మూర్తి పురస్కారం

భీమవరం రూరల్, ఆగస్టు 19 : తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో భాగంగా వీరవాసరం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులు పంపన సాయిబాబుకు గిడుగు రామ్మూర్తి పురస్కారం లభించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్ తెలిపారు.

లక్ష గాజులతో కనకదుర్గమ్మకు అలంకారం

భీమవరం రూరల్, ఆగస్టు 19 : పౌర్ణమి సందర్భంగా శ్రీరాంపురం రోడ్డులోని శ్రీజగన్మాత కనకదుర్గమ్మ అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు తొలుత అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష గాజులు, 1000 రవికలు, పసుపు, కుంకుమలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అలంకరణ చేసిన గాజులు, రవికులు భక్తులు అందజేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పితాని సత్యనారాయణ, పొన్నా రంగారావు తెలిపారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమం వాయిదా

భీమవరం రూరల్, ఆగస్టు 19 : జిల్లాలో ఈనెల 20వ తేదీన జరగవల్సిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సెప్టెంబరు 17కు వాయిదా వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సంవత్సరంలో రెండుసార్లు జరపబడే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యా సంస్థల్లో ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు.

23న ఉద్యోగ దిక్సూచి

భీమవరం రూరల్, ఆగస్టు 19 : నర్సాపురంలో ఈనెల 23వ తేదీన జరిగే ఉద్యోగ దిక్సూచి కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నరసాపురం వైఎన్ డిగ్రీ కళాశాలలో ఆగస్టు 23న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సోమవారం తెలిపారు. సుమారు 450పైగా ఉద్యోగవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://టిఐఎన్‌వైయుఆర్ఎల్.కామ్/ప్లేస్‌మెంట్-సెల్-డబ్ల్యుజీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు నాగేంద్ర 95020 24765, ప్రసన్న 70138 96277, రాధిక 94418 41622 నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

తణుకు, ఆగస్టు 19: జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ కేజేఎస్ రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్జీవో కాలనీ, కొమ్మాయిచెర్వు గట్టు అర్బన్ హెల్త్ సెంటర్ సందర్శించారు. ల్యాబ్‌లో రికార్డులను పరిశీలించారు. ఫీవర్ కేసుల విషయంలో పరీక్షల ద్వారా నిర్ధారణ కీలకమన్నారు. తప్పనిసరిగా అర్బన్ హెల్త్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని చెప్పారు. ప్రతి రోజూ డ్రైడే పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలూరులో నా మొక్క-నా శ్వాస

అత్తిలి, ఆగస్టు 19 : మండలంలోని పాలూరులో ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నా మొక్క- నా శ్వాస కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పీఠం సభ్యుడు ఎస్వీ సత్యనారాయణ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా ఇచ్చిన పిలుపు మేరకు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. అత్తిలి సభ్యుడు నందం తాతయ్య పాల్గొన్నారు.

అత్తిలి ఎంపీడీవో బదిలీ

అత్తిలి, ఆగస్టు 19: అత్తిలి ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు ఏలూరు జిల్లా పోలవరానికి బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏలూరు జిల్లా పోలవరం నుంచి అత్తిలి మండలానికి ఆయన బదిలీ అయ్యారు. తిరిగి పోలవరం బదిలీ అయిన సందర్భంగా అత్తిలి ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు ఆయనను సన్మానించారు. అత్తిలి ఎంపీడీవోగా అమీలు జమా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

బస్‌పాస్‌ల వితరణ

తణుకు, ఆగస్టు 19: పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు 174 మందికి సోమవారం వైద్యులు కర్రి శ్రీనివాసులు రెడ్డి, సూర్యప్రభ ఆర్థిక సాయంతో బస్‌పాసులు అందజేశారు. కర్రి యశ్వంత్ రెడ్డి, కర్రి కార్తీక్ రెడ్డి, హెచ్‌ఎం. తోట వరలక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు ప్రైవేట్ బ్యాంకులు అండగా ఉండాలి

నరసాపురం, ఆగస్టు 19: ప్రైవేట్ బ్యాంకులు లాభాపేక్షతో కాకుండా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు తక్కువ మొత్తాలకు రుణాలిచ్చి అండగా నిలవాలని నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామనాయుడు కోరారు. స్టీమర్‌రోడ్డులో సోమవారం రాత్రి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుతో కలసి వాణి కోపరేటివ్ బ్యాంకు బ్రాంచ్‌ను ప్రారంభించారు.